సాక్షి మెదక్

గురువారం । 10 । జూలై । 2025



మా భూములు మాకివ్వండి!
సాగునీరు అందించేందుకు సేకరించిన భూములపై 18 ఏళ్లయినా సందిగ్ధం వీడలేదు.
వివరాలు 8లో ▸



చదువుకునే వారికి వరం
చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ మంచి అవకాశం కల్పిస్తుంది.
వివరాలు 8లో ▸



అలంకారప్రాయమేనా..!
పాఠశాల భవనం అలంకారప్రాయంగా మారింది. విద్యార్థులకు నిరాశే ఎదురైంది.
వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

రేపు నీటి సరఫరాకు అంతరాయం

నర్సాపూర్: ఈనెల 11వ తేదీన నల్లాల ద్వారా మిషన్ భగీరథ నీటి సరఫరా ఉండదని ఆ పథకం ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. హత్నూర మండలంలోని బోర్పట్ల నుంచి నర్సాపూర్‌కు వచ్చే పైపులైన్‌కు లీకేజీ ఏర్పడినందున మరమ్మతులు చేపట్టనున్నట్లు చెప్పారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి



రైతులకు మినుము విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీ సంధ్యారాణి

నర్సాపూర్ రూరల్: వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని నర్సాపూర్ వ్యవసాయ శాఖ ఏడీ సంధ్యారాణి రైతులకు సూచించారు. బుధవారం నర్సాపూర్ రైతు వేదికలో జాతీయ ఆహార, పోషక భద్రత పథకం కింద రైతులకు మినుములు, జొన్న విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడిని ఇచ్చే పంటలు సాగు చేసుకునే విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించి సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏ ఓ దీపిక, ఏఈఓ మోహన్ రైతులు పాల్గొన్నారు.

ఎస్ఈకి శుభాకాంక్షలు



ఎస్ఈ నారాయణ నాయక్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆర్వీకే యూనియన్ నాయకులు

మెదక్ కలెక్టరేట్: విద్యుత్ శాఖ ఎస్ఈగా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన నారాయణ నాయక్‌ను రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్వీకే) యూనియన్ నాయకులు బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు అశోక్, అధ్యక్షుడు రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్, ఉపాధ్యక్షులు ఉస్మాన్, కంపెనీ అసిస్టెంట్ సెక్రటరీ బాలయ్య, సలహాదారులు కిరణ్, మెదక్ డివిజన్ అధ్యక్షులు ఆకుల నాగరాజు అసిస్టెంట్ సెక్రటరీ భిక్షపతి, తూప్రాన్ డివిజన్ అధ్యక్షుడు చేపూరి రాములు, సెక్రటరీ వెంకటయ్య, ప్రభాకర్, సాయిలు, వెంకటేష్, అజీజ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శ్రద్ధగా చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి జగదీష్

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌ను జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి జగదీష్ బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి భోజనం తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా, బట్టలు, బ్లాంకెట్స్ ఇచ్చారా..? అని ఆరా తీశారు. హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని చెప్పారు. శ్రద్ధగా చదువుకోవాలన్నారు. సమస్యలుంటే వార్డెన్‌కు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ జిల్లా సహాయ అధికారి గంగాకిషన్, వార్డెన్ ప్రణయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: మెదక్ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో నైట్ వాచ్‌మెన్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ రాధాకిషన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని యూఆర్ఎస్‌లలో వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల పురుష అభ్యర్థులు ఈనెల 12వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు మెదక్ జిల్లా నివాసులై ఉండాలన్నారు. మెదక్ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఉద్యోగం నిర్వహించాల్సి ఉంటుందన్నారు. 5.6 ఎత్తు కలిగి 10వ తరగతి ఉత్తీర్ణులై ఏదైనా సెక్యూరిటీ సంస్థచే శిక్షణ పొంది ఉండాలన్నారు. కనీస వేతనం రూ. 9,750 ఉంటుందని, మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి సై

- ఈ సీజన్ నుంచే ప్రారంభం
- ఐదు మండలాల్లో 15 క్లస్టర్ల ఏర్పాటు
- ఒక్కో క్లస్టర్ పరిధిలో 125 మంది రైతుల గుర్తింపు
- 1,875 ఎకరాల్లో అమలుకు సన్నాహాలు

జిల్లాలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ అమలు

రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈక్రమంలోనే జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు జిల్లాకు చెందిన అధికారులు, శాస్త్రవేత్తలకు ఇటీవల తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వీరు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించనున్నారు. – రామాయంపేట(మెదక్)



జిల్లా పరిధిలో ఈ పథకం కింద మొదటి విడతగా ఐదు మండలాల్లోని 15 గ్రామాల్లో 15 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో క్లస్టర్‌లో కనీసం 125 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఈ క్లస్టర్ల పరిధిలో మొత్తం 1,875 ఎకరాల్లో ఈ సీజన్ నుంచే ప్రకృతి వ్యవసాయం ప్రారంభించాలని ప్రణాళిక రచించారు. ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన ఉన్న రైతులు, మహిళా సంఘాలు, సేంద్రియ వ్యవసాయం పట్ల అవగాహన ఉన్న వారిని ఈ పథకం కింద ఎంపిక చేశారు. ప్రతి క్లస్టర్ పరిధిలో నాలుగైదు గ్రామాలకు చెందిన రైతులు ఉంటారు. ముందస్తుగా ఎంపిక చేసిన రైతులకు ఈవిధానం పట్ల పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి శిక్షణ ఇస్తారు. సేంద్రియ సాగు, జీవ ఎరువుల తయారీ, పంట ఉత్పత్తుల మార్కెటింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడంతో పాటు క్షేత్రస్థాయి సందర్శనకు తీసుకెళ్తారు. ఎంపిక చేసిన పంట చేలతో మట్టి నమూనా సేకరించి సాయిల్ టెస్టు నిర్వహిస్తారు. రసాయన ఎరువుల వినియోగంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని, సాధ్యమైనంత మేర రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించడానికే కేంద్రం ఈపథకం ప్రవేశపెట్టిందని తునికి కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు.

పథకం ముఖ్య ఉద్దేశం

- సాధ్యమైనంత మేర వ్యవసాయ సంబంధిత ఖర్చులను తగ్గించడం.
- భూమి సారవంతాన్ని, ఆరోగ్యాన్ని కాపాడటం, పర్యావరణ పరిరక్షణకు దోహదపడటం.
- ప్రజలకు రసాయన అవశేషాలు లేని, పోషక విలువలున్న ఆరోగ్యకర ఆహారం అందించడం.
- విభిన్న పంటల సాగును ప్రోత్సహించడ ద్వారా జీవ వైవిధ్యం పెంపొందించడం.

జిల్లాలో ఎంపికైన క్లస్టర్ల వివరాలు

మండలం	గ్రామాలు
చిన్నశంకరంపేట	టీ. మాందాపూర్, సంగాయపల్లి, గజగట్లపల్లి, మడూర్, రుద్రారం
హవేలిఘణాపూర్	ముత్తయకోట, ముద్దల్‌వాయ్
కొల్చారం	కొల్చారం, అంసాన్‌పల్లి, ఎనగండ్ల, పోతంశెట్టిపల్లి
మాసాయిపేట	హకీంపేట, బొమ్మారం
చిలప్‌చెడ్	శీలంపల్లి, గంగారం

ఇది మంచి పథకం



జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకం ఎంతో ఉన్నతమైంది. ఈమేరకు దీనిని జిల్లాలో అమలు పర్చడానికి క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాం. 15 క్లస్టర్లలో 1,875 మంది రైతులను గుర్తించాం. త్వరలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తాం.
– వినయ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

గుణాత్మక విద్యనందించాలి

కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళిఘణాపూర్(మెదక్): నాణ్యమైన, గుణాత్మక విద్యను అందించడానికి ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు చొరవ తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని డైట్ కళాశాలలో ప్రాథమిక, ఉన్నతస్థాయి విద్యా ప్రమాణాల మెరుగు కోసం ఎఫ్ఎల్ఎన్ మానిటరింగ్ సమా వేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రాథమిక ఉన్నతస్థాయి లో విద్యా ప్రమాణాల మెరుగుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఉత్తమ విద్యాబోధన చేసి ప్రతిభావంతులైన విద్యార్థులను తయారు చేయడంలో ఉపాధ్యాయులు పాత్ర కీలకమన్నారు. పని సర్దుబాటు విషయంలో ప్రభుత్వ నిబంధనల ఆధారంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో డీఈఓ రాధాకిషన్, కో–ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

'బెస్ట్ అవైలబుల్'కు విద్యార్థుల ఎంపిక

మెదక్‌కలెక్టరేట్: బెస్ట్ అవైలబుల్ పథకం కింద మిగిలి ఉన్న సీట్లను కేటాయించినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లాటరీ ప్రక్రియను విద్యార్థులు తల్లిదండ్రుల సమక్షంలో నిర్వహించారు. ఈసందర్భంగా మొత్తం 6 సీట్లకు 1వ తరగతికి ముగ్గురు, 5వ తరగతికి ముగ్గరిని ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోండి



ఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేస్తున్న పద్మారెడ్డి, నాయకులు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి బుధవారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రోహిత్ ఇటీవల ఓ న్యూస్ ఛానల్ ఇంటర్వ్యూలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావుపై అసభ్య పదజాలంతో కూడిన అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు పేర్కొన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలని ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరుల్ని చేస్తాం

అదనపు కలెక్టర్ నగేష్



మహిళా సంఘాల సభ్యులతో అదనపు కలెక్టర్ నగేష్

మెదక్ కలెక్టరేట్: కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సంబరాలను ప్రారంభించి మాట్లాడారు. విజయోత్సవ సంబరాల ఆవశ్యకత, నిర్వహణ గురించి దిశా నిర్దేశం చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలను అన్ని అంశాల్లో సాధికారత వైపు నడిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగా రుణాలను అందిస్తూ వివిధ యూనిట్ల ఏర్పాటుకు సహకారం అందిస్తుందన్నారు. పథకంతో లబ్ధిపొందిన మహిళలను ఆదర్శంగా తీసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఈనెల 11 వరకు జరిగే సంబరాల్లో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల వారీగా వడ్డీలేని రుణాలు, ప్రమాద బీమా, లోన్ బీమాలకు సంబంధించిన చెక్కుల పంపిణీ, కళాజాత ప్రదర్శనల ద్వారా అవగాహన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం యాదయ్య, అడల్ట్ ఎడ్యుకేషన్ జిల్లా అధికారి మురళి, ఏపీఎం వెంకటస్వామి, టీఎంసీ మెప్మా సునీత, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

ఆషాఢం సంబరాలు



గోరింటాకుతో మహిళలు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో ఆషాఢమాసం సందర్భంగా మహిళలందరూ కలిసి బుధవారం గోరింటాకు సంబరాలను ఘనంగా నిర్వహించా రు. ముందుగా స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. చేతులకు గోరింటాకు పెట్టుకొని ఆట పాటలతో సందడి చేశారు.

అభ్యంతరాలుంటే చెప్పండి

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని కేజీబీవీలలో ఉద్యోగాల కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు మరోసారి మెరిట్ లిస్టను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ రాధాకిషన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేజీబీవీలో ఖాళీగా ఉన్న అకౌంటెంట్ (3), ఏఎన్ఎం (4) ఉద్యోగాల భర్తీకి గతంలో మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. మెరిట్ జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే సమగ్ర శిక్షా కార్యాలయంలో ఈనెల 12లోగా ఫిర్యాదులు అందజేయాలని సూచించారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ఆర్డీఓ జయచంద్రారెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

తూప్రాన్: పట్టణ పరిధిలోని రావెల్లి మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆర్డీఓ జయచంద్రారెడ్డి బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా హాస్టల్ వసతి, ఆహార ప్రమాణాలు, పరిశుభ్రత.. తదితర అంశాలపై ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఆరోగ్య పరిరక్షణ, భవిష్యత్తు కార్యాచరణపై అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. కాగా హాస్టల్‌లో సమస్యలను విద్యార్థులు ఆర్డీఓ దృష్టికి తీసుకొచ్చారు. ఉన్నతాధికారుల సహకారంతో త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఫీజు బకాయికి ప్రామిసరీ నోటు

నర్సాపూర్: టీసీ ఇవ్వడానికి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయొద్దనే నిబంధనలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. శివ్వంపేటకు చెందిన రవినాయక్ తన కుమారుడు శ్రీరాంనాయక్‌ను నర్సాపూర్‌లోని ఎల్లంకి ప్రైవేట్ డిగ్రీ కాలేజీలో గతేడాది బీఏలో చేర్పించాడు. ప్రస్తుతం ఆయన తన కుమారుడిని వేరే కాలేజీలో చేర్పించేందుకు టీసీ కావాలని బుధవారం కాలేజీకి వచ్చి అడిగారు. గతేడాది ఫీజు చెల్లిస్తేనే టీసీ ఇస్తామని వారు చెప్పారు. అంత డబ్బు లేదని, ప్రస్తుతం రూ. రెండు వేలు ఇస్తానని, మిగిలిన రూ. ఆరు వేలు స్కాలర్‌షిప్ రాగానే చెల్లిస్తానని పేర్కొన్నాడు. బ్యాంకు చెక్ లేదా ప్రామిసరీ నోట్ రాసిస్తే టీసీ ఇస్తామని చెప్పడంతో చేసేది లేక రాసిచ్చాడు. ఈవిషయమై కాలేజీ ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్‌ను వివరణ కోరగా.. తాను కాలేజీలో లేనని, విద్యార్థి తమ కాలేజీ నుంచి వెళ్లిపోతే తమకు రెండు సంవత్సరాల ఫీజు నష్టం వస్తుందన్నారు. అయినా విద్యార్థి తండ్రి అభ్యర్థన మేరకు పాత ఫీజు బకాయి చెల్లించి టీసీ తీసుకువెళ్లాలని చెప్పామని పేర్కొన్నాడు.

కదం తొక్కిన కార్మికలోకం



మెదక్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

మెదక్ కలెక్టరేట్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మికులు కదం తొక్కారు. బుధవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మెదక్ ఎమ్మార్వో కార్యాలయం నుంచి రాందాస్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, వాటి స్థానంలో 4 లేబర్ కోడ్‌లను ముందుకు తీసుకొచ్చిందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం జూలై 5 తేదీన పని గంటలను పెంచుతూ జీఓ 282 తీసుకొచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా కార్మికవర్గాన్ని ఐక్యం చేసి దీర్ఘకాలిక పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఏసు, అమృత, శోభ, ఎల్లవ్వ, అంగన్‌వాడీ టీచర్లు రాజ్యలక్ష్మి, లత, దుర్గ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి సన్నిధిలో భక్తులు

శాకంబరిదేవిగా విద్యాధరి

వర్గల్ క్షేత్రంలో వైభవంగా మూల మహోత్సవం

వర్గల్ సరస్వతి క్షేత్రంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. బుధవారం మూల నక్షత్ర మహోత్సవ వేళ అమ్మవారు పండ్లు, కూరగాయలు ఆభరణాలుగా ధరించి శాకంబరిదేవిగా దివ్యదర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచే మూల మహోత్సవ వేడుకలు మొదలయ్యాయి. గర్భగుడిలో మూలవిరాట్టుకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం కూరగాయలు, పండ్లు, ఆకు కూరలు ఆభరణాలుగా అమ్మవారిని కమనీయంగా అలంకరించారు. కుంకుమార్చన, సప్తశతి పారాయణం, సామూహిక భక్తజన లక్షపుష్పార్చన జరిపారు. చండీహోమం నిర్వహించి పూర్ణాహుతి చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందారు. (– వర్గల్(గజ్వేల్)

క్లుప్తంగా

ఐఐటీ మద్రాస్‌తో భాగస్వామ్యం

పాఠశాలల హెచ్ఎంల వెల్లడి

సిద్దిపేటరూరల్: స్కూల్ కనెక్ట్ పేరుతో ఐఐటీ మద్రాస్ నిర్వహిస్తున్న కార్యక్రమానికి నారాయణరావుపేట పాఠశాలతో పాటు, ఆర్డీఎఫ్ మాటిండ్ల పాఠశాల భాగస్వామ్యం అవుతున్నట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నరసింహ చారి, విష్ణుమూర్తి బుధవారం తెలిపారు. ఐఐటీతో విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ వంటి వివిధ కోర్సులకు సంబంధించిన ప్రాథమిక విషయాలు, కోడింగ్‌పై అవగాహన, ఐఐటీ ప్రొఫెసర్లతో ఆన్‌లైన్ ద్వారా నేర్చుకోబోతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత పదవ తరగతి విద్యార్థులతో పాటు రాబోయే రెండేళ్లు కూడా విషయ పరిజ్ఞానాన్ని నేర్చుకోనున్నారు.

సిద్ధప్ప రచనలు యువతకు ఆదర్శం



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్ధప్ప వరకవి రచనలు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయని, ప్రముఖ విద్యావేత్త రాదారి నాగరాజు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో సిద్ధప్ప జయంతిని శాలివాహన ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సిద్దిపేట (సేవాస్) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వరకవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ... సిద్ధప్ప గోల్కొండ కవిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించారన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో సిద్ధప్ప పాఠ్యాంశాన్ని ప్రచురించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో నగేష్, ఆంజనేయులు, రామచంద్రం, రాంచంద్రం, దుర్గయ్య పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పటాన్‌చెరు టౌన్: ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని వాణినగర్‌లో వాటర్ ప్లాంట్‌లో పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో మంగళవారం అర్ధరాత్రి పోలీసులు దాడులు చేశారు. ఐదు మందిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.23,130 నగదు, ద్విచక్ర వాహనం, కారు, 7 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ విడి భాగాల చోరీ

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాల మండల పరిధిలోని అర్జున్ పట్ల గ్రామంలో అహ్మద్ షరీఫ్‌నకు చెందిన ట్రాక్టర్ బ్యాటరీ, సెల్ఫ్ మోటార్, బంపర్ చోరీకి గురయ్యాయి. బాధితుడి వివరాల ప్రకారం... మంగళవారం వరి నాటు దున్నకాల నిమిత్తం తమ వ్యవసాయ బావి వద్ద ట్రాక్టర్ ఉంచగా అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు, ట్రాక్టర్ విడి భాగాలు దొంగిలించారు. వీటి విలువ దాదాపుగా రూ.40వేల వరకు ఉంటుందని తెలిపారు.

18 మందికి జరిమానా, ఒకరికి జైలు

గజ్వేల్‌రూరల్: డ్రంకెన్ డ్రైవ్‌లో ఓ వ్యక్తికి రెండ్రోజుల జైలు శిక్ష పడినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన చౌరస్తాల వద్ద ఇటీవల డ్రంకెన్ డ్రైవ్‌లో 18 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు బ్రీత్ ఎనలైజర్ ద్వారా గుర్తించారు. వారిని బుధవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ఎదుట హాజరు పర్చగా 18మందికి రూ.27,500 జరిమానాతో పాటు ఓ వ్యక్తికి 2 రోజుల జైలు శిక్ష విధించారు.

బస్సు కిందపడి తీవ్ర గాయాలు

తూప్రాన్: ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు కింద పడిన వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటన పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... దోమకొండకు చెందిన శ్రీనివాస్ కొంత కాలంగా తూప్రాన్‌లో పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మేడ్చల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొని కిందపడిపోయాడు. శ్రీనివాస్ కుడి కాలుపై నుంచి బస్సు చక్రాలు వెళ్లడంతో నుజ్జునుజ్జు అయింది. మెరుగైన వైద్యం కోసం గాంధీకి తరలించారు.

మా భూములు మాకివ్వండి!



ప్రాజెక్ట్ రద్దుతో నిర్మించిన కెనాల్



తోటపల్లి ప్రాజెక్ట్ కోసం సేకరించిన భూములు

తోటపల్లి భూములపై సందిగ్ధం

- ప్రాజెక్టు రద్దయి నేటికీ పద్దెనిమిదేళ్లు
- ప్రభుత్వ ఆధీనంలో 1503 ఎకరాలు
- తిరిగివ్వాలని మంత్రిని కోరిన రైతులు

కోహెడరూరల్(హుస్నాబాద్): హుస్నాబాద్ ప్రాంతంలో సాగునీరు అందించేందుకు సేకరించిన భూములపై 18 ఏళ్లయినా సందిగ్ధం వీడటం లేదు. బెజ్జంకి మండలంలోని తోటపల్లిలో 0.095 టీఎంసీల సామర్థ్యంతో 49వేల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు ప్రాజెక్ట్ నిర్మాణానికి బెజ్జంకి, కోహెడ, చిగురుమామిడి మండలాల్లో 1603 ఎకరాల భూమిని 2007లో సేకరించారు. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేశారు. కానీ, బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ప్రాజెక్ట్‌ను రద్దు చేసి రీ డిజైన్ చేశారు. వంద ఎకరాల్లో కెనాల్స్ నిర్మించగా 1503 ఎకరాల భూమి ప్రభుత్వం ఆధీనంలో ఉంది. ఈ భూములను తిరిగివ్వాలని రైతులు కోరుతున్నారు.

500 మంది రైతులు

తోటపల్లి ప్రాజెక్ట్‌కు మూడు మండలాల్లో 500 మంది రైతుల నుంచి 1600 ఎకరాలకుపైగా భూమిని ప్రభుత్వం సేకరించింది. ఒక్కో ఎకరానికి అప్పటి మార్కెట్ ప్రకారం 2.10లక్షల పరిహారం చెల్లించి 2007లో సెప్టెంబర్ 9న శంకుస్థాపన చేశారు. తరువాత కొద్ది రోజులకే పనులు నిలిచిపోయాయి. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే రిజర్వాయర్ నిర్మాణం, ప్రయోజనాలపై అధ్యయనం చేసింది. గౌరవెల్లిలో ప్రాజెక్ట్ నిర్మిస్తామని హామీ ఇచ్చింది. రిజర్వాయర్ కోసం సేకరించిన 100 ఎకరాల్లో గ్రావిటీ కెనాల్స్ నిర్మించారు. మిగతా భూమిని రైతులకే ఇస్తామని అధికారులు తెలిపారు. కానీ, జిల్లాల విభజనలో బెజ్జంకి, కోహెడ మండలాలు సిద్దిపేటలో, చిగురుమామిడి మండలం కరీంనగర్ జిల్లాలో ఉన్నాయి.

బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా

తోటపల్లి రిజర్వాయర్‌ను రద్దు చేసిన తరువాత బ్యాలెన్సింగ్ చెరువుగా వాడుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు మిడ్‌మానేర్ నుంచి గోదావరి నీటిని గ్రావిటీతో కుడి కాలువ నుంచి గౌరవెల్లి ప్రాజెక్ట్‌కు నీటిని తరలించాలనుకున్నారు. దీన్ని 8.23 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. దీంతో కుడి, ఎడమ కాలువల ద్వారా 1.06 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది.



మంత్రి పొన్నంను కలిసిన రైతులు

ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరిని రాంచంద్రాపూర్ రైతులు భూములు తిరిగి ఇవ్వాలని వినతిపత్రం అందించారు. తామే సాగు చేసుకుంటున్నామని తిరిగి ఇవ్వాలని వేడుకున్నారు. అప్పట్లో కాంగ్రెస్ హయాంలో భూములు సేకరించారని, ప్రస్తుతం వారే అధికారంలో ఉండటంతో తిరిగి ఇస్తారని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

హైకోర్టుకు వెళ్లినా..

గతంలో పలువురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఎకరానికి రూ.9.25 లక్షలు చెల్లించి భూములు తీసుకోవచ్చని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఓ సీడ్స్ కంపెనీ ప్రభుత్వానికి 124 ఎకరాలకు డబ్బులు చెల్లించింది. హుస్నాబాద్ ఆర్డీఓ 2021లో సదరు కంపెనీ పేరుపై భూమి రిజిస్ట్రేషన్ చేశారు. కానీ, రైతులు డబ్బు కట్టేందుకు ముందుకొచ్చినప్పుడు పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి.

చుట్టూ కంచె వేస్తారని ప్రచారం

రిజర్వాయర్‌కు సేకరించిన భూములను రైతులే సాగు చేసుకుంటున్నారు. అయితే మిగిలిన 1503 ఎకరాల్లో ఫ్యాక్టరీ, ప్రభుత్వ మెడికల్, పాలిటెక్నిక్ కళాశాలలు నిర్మిస్తారని ప్రచారం జరుగుతుంది. భూముల చుట్టూ రైతులు సాగు చేయకుండా కంచె వేస్తారన్న ప్రచారంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి మార్కెట్ ధర ప్రకారం డబ్బు చెల్లిస్తామని వేడుకుంటున్నారు.

మార్కెట్ ధర చెల్లిస్తాం



రిజర్వాయర్ కోసం సేకరించిన మా భూములు మాకే ఇవ్వాలి. మేము ప్రాజెక్ట్ కోసం మాత్రమే ఇచ్చాం. కాలువ కోసం కాదు. కొన్నేళ్లుగా మేమే భూమిని సాగు చేసుకుంటున్నాం. ప్రస్తుత మార్కెట్ ధర చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– ముద్దమల్ల శ్రీనివాస్,రైతు

పదెకరాలు కోల్పోయా



మొత్తం మా కుటుంబం నుంచి 10 ఎకరాల భూమి ప్రాజెక్ట్‌లో కోల్పోయినం. అప్పుడు ఎకరానికి 2.10 లక్షలు మాత్రమే చెల్లించారు. రిజర్వాయర్ వస్తే నీరు వస్తుందని భూమి ఇచ్చాం. ప్రాజెక్ట్ రద్దయింది కాబట్టి తిరిగివ్వాలి. రెవెన్యూ రికార్డుల్లో ప్రాజెక్ట్‌లో పోయినట్టు చూపిస్తుంది. మా భూములు మాకు తిరిగి ఇవ్వాలి.

– సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రైతు, రాంచంద్రాపూర్

అభివృద్ధిలో మేటి



రైతువేదికను పరిశీలించిన అనంతరం శిక్షణ బృందం, అధికారులు

మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్ల కితాబు

సిద్దిపేటరూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, తదితర కార్యక్రమాలతో గ్రామాన్ని అభివృద్ధి చేయడం బాగుందని మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన డిప్యూటీ కలెక్టర్ల బృందం కితాబిచ్చింది. బుధవారం మండల పరిధిలోని చిన్నగుండవెల్లి గ్రామానికి మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణకేంద్రం హైదరాబాద్‌లో శిక్షణ పొందుతున్న మధ్యప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్లు సందర్శించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో చేపట్టిన డంపింగ్‌యార్డు, వైకుంఠధామం, రైతు వేదిక, పల్లెప్రకృతివనం, పాఠశాలలు తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ మల్లికార్జున్ రెడ్డి, ఎంపీడీఓ మురళి ధర్‌శర్మ, ఎంపీఓ విష్ణు, నారాయణరావుపేట ఎంపీఓ శ్రీనివాసరావు, కొండపాక ఎంపీఓ మల్లికార్జున్ రెడ్డి, చిన్నకోడూరు ఎంపీఓ సోమిరెడ్డి, గ్రామ ప్రత్యేక అధికారి సౌమ్య, పంచాయతీ కార్యదర్శులు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, మహిళలు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రుణాలు తీసుకొని ఆర్థికంగా బలపడాలి

పేదరిక నిర్మూలన సంస్థ అదనపు సీఈఓ కాత్యాయని



మాట్లాడుతున్న పేదరిక నిర్మూలన సంస్థ సీఈఓ కాత్యాయని

నర్సాపూర్ రూరల్: మహిళా సంఘాల ద్వారా వ్యవసాయంతో పాటు వ్యాపారాలకు రుణాలు తీసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ అదనపు సీఈఓ కాత్యాయని పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నారాయణపూర్, లింగాపూర్‌లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘాలు ఏర్పడి 25 ఏళ్లు గడిచిన సందర్భంగా సంబురాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళా సంఘాల్లో లేని మహిళలను గుర్తించి చేర్పించాలని సూచించారు. కిశోర బాలికలు, 60 ఏళ్లు దాటిన మహిళలు, వికలాంగులను గుర్తించి వారిని సైతం చేర్పించి ఆర్థికంగా, సామాజికంగా, ఆరోగ్యపరంగా అభివృద్ధి చెందేలా చూడాలన్నారు. అదనపు డీఆర్‌డీఓ సరస్వతి, ఎంపీడీఓ మధులత, ఏపీఎం గౌరీశంకర్, డీజీఎం దత్తు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం



అరుణ



మౌనిక

రామాయంపేట(మెదక్): అర్ధరాత్రి ఇద్దరు మహిళలు ముందస్తుగా వేసుకున్న పథకం ప్రకారం ఇంటినుంచి వెళ్లిపోయారు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలరాజు కథనం ప్రకారం... అక్కల హనుమాన్, బాలకృష్ణ సోదరులు. పట్టణంలో నివాసం ఉంటున్నారు. ఇద్దరికి వివాహాలయ్యాయి. రాత్రి భోజనాలు చేసి పడుకున్నారు. హనుమాన్ బుధవారం ఉదయం లేచి చూడగా, తన భార్య అరుణ (27), తమ్ముడి భార్య మౌనిక (26) కూడా కనిపించలేదు. చుట్టుపక్కల ఇళ్లలో, ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేదు. కాగా అరుణ, మౌనిక తమ సెల్‌ఫోన్లను ఇంట్లోనే ఉంచి వెళ్లిపోయారు. ఇంట్లో గొడవల కారణంగా వారు వెళ్లిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. వారు నేరుగా బస్టాండుకు వెళ్లి బస్సు ఎక్కినట్లు సీసీ ఫుటేజీలో రికార్డు అయింది. హనుమాన్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తూప్రాన్‌లో యువకుడు..



ఐలయ్య

తూప్రాన్: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పట్టణ కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ యాదగిరి వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం వెలూరుకు చెందిన మల్లేల ఐలయ్య(28) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇంటి నుంచి తూప్రాన్‌కు వచ్చిన ఐలయ్య తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

- లేకుంటే తీవ్ర పరిణామాలు
- కలెక్టర్ హైమావతి



తొగుటలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

దుబ్బాక/తొగుట: పిల్లలు ఆరోగ్యంగా ఎదిగేందుకే ప్రభుత్వం రోజువారి మెనూను మధ్యాహ్న భోజనం కోసం రూపొందించిందని కలెక్టర్ హైమావతి అన్నారు. బుధవారం తొగుట మండల కేంద్రంలో కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం కాకుండా ఒక కూర, గుడ్డు మాత్రమే ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివరాలను వెంటనే ఈఓకు పంపించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డిని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి భోజనం గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేను మొదట టీచర్‌నే..ఇప్పుడు కలెక్టర్‌ను అయ్యా.. బడిలో విద్యార్థులను తమ సొంత పిల్లల్లా ఉపాధ్యాయులు భావించాలని సూచించారు. మళ్లీ వస్తానని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఇవ్వకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తొగుట మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్‌ను, నిర్మాణ ప్రగతిని కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంఈఓ నర్సయ్య తదితరులు ఉన్నారు.

బాత్రూమ్‌లో జారిపడి వ్యక్తి మృతి



సదానందం

అక్కన్నపేట(హుస్నాబాద్): బాత్రూమ్‌లో కాలు జారి కిందపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సీహెచ్. ప్రశాంత్ వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన మాటూరి సదానందం(48) గీతకార్మికుడు. గత నెలలో తాటిచెట్టుపై నుంచి కాలుజారి పడి తీవ్ర గాయాలవ్వగా.. హన్మకొండలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకొని ఈ నెల 5న ఇంటికి వచ్చాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంట్లో ఎవరి సహాయం లేకుండా బాత్రూమ్‌కు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడటంతో కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

నారాయణఖేడ్: అనారోగ్యంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నాగల్‌గిద్ద మండలం కిషన్ నాయక్ తండాలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సాయిలు వివరాల ప్రకారం... తండాకు చెందిన ప్రకాష్ రాథోడ్ (36) ఫైల్స్ సమస్యతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది చెట్టుకు ఉరి వేసుకున్నాడు.

అప్పుల బాధతో యువకుడు..

మనోహరాబాద్(తూప్రాన్): అప్పులు తీర్చలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మనోహరాబాద్ మండల పరిధిలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే పోలీసుల వివరాల ప్రకారం ... కూచారం గ్రామానికి చెందిన డప్పు ప్రవీణ్‌కుమార్ (25) చెడు వ్యసనాలకు బానిసై అప్పులు చేశాడు. అవి తీర్చలేక మానసిక వేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో కూచారం శివారులో రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్తు తెలియని రైలు పైనుంచి వెళ్లడంతో మొండెం, తల వేరుగా పడిపోయాయి.

డ్రమ్ సీడర్‌లో వరి సాగుపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

గజ్వేల్: గజ్వేల్‌లోని ఇస్మాయిల్‌ఖాన్ వ్యవసాయ క్షేత్రంలో బుధవారం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ వీరస్వామి మాట్లాడుతూ... డ్రమ్ సీడర్ పద్ధతితో వరి సాగు చేయడం వల్ల పెట్టుబడి ఎకరాకు రూ.8వేలకు పైగా తగ్గుతుందని చెప్పారు. ఆరుతడి పద్ధతిలో నీరు ఇవ్వడం వల్ల వరి నుంచి అధికంగా విడుదలయ్యే మిథేన్ వాయువును తగ్గించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ లహరి, ఏరియా మేనేజర్ సాయికుమార్ పాల్గొన్నారు.

సాంకేతిక ఆధారాలపై పోలీసుల ఫోకస్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పరిధిలోని బండ్లగూడ బాలాజీనగర్‌లో జరిగిన రమ్య హత్య కేసులో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. నిందితుడు తప్పించుకోలేని విధంగా సాంకేతిక ఆధారాలను పోలీసులు సేకరిస్తున్నారు. ప్రధాన అనుమానితుడైన రమ్యను ప్రేమించిన ప్రవీణ్ కుమార్‌పై దృష్టి సారించారు. ఆయన సెల్‌ఫోన్ ద్వారా చేసిన కాల్‌డేటా, ఫోన్ సంభాషణ, మెయిల్ వాడకంతోపాటు ఘటన జరిగిన రోజు ఇద్దరి లొకేషన్ తదితర వివరాలు సేకరించారు. ఈ కేసు విషయంలో పోలీస్ అధికారులు ఒక నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రవీణ్ కుమార్ నుంచి వివరాలు సేకరించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ప్రవీణ్ రమ్య హత్యకు కారకుడా? లేదా ఇతరుల ప్రమేయం ఏమైనా ఉందా? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. అదే విధంగా బాలాజీనగర్ కాలనీలో నివాసించే చుట్టూ పక్కల వారి నుంచి సైతం వివరాలు సేకరిస్తున్నారు. రమ్యకు పెళ్లి సంబంధాలు చూసి వివాహం చేయాలనే ఆలోచనలో తల్లిదండ్రులు ఉండటంతో పాటు ఆమె కూడా కొన్ని రోజులుగా ప్రవీణ్‌తో మాట్లాడటం లేదని తెలుస్తుంది. దీంతో ఇన్ని రోజులు తనతో తిరిగిన ప్రియురాలు తనకు దక్కదనే బాధతో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడా? ఇంకా ఏమైనా జరిగిందా? అనే విషయం తెలియలేదు. చికిత్స పొందుతున్న ప్రవీణ్ కోలుకుంటే తప్ప అసలు విషయాలు తెలుస్తాయని పోలీసులు చెబుతున్నా రు. ఇప్పటికే క్లూస్ టీం నుంచి వచ్చిన ఆధారాలతో హత్యకు కారకులు ఎవరనేది తెలిపోయియినట్లు సమాచారం. ప్రస్తుతం బీరంగూడ చౌరస్తాలోని ఓ ఆస్పత్రిలో ప్రవీణ్‌కుమార్ చికిత్స పొందుతున్నాడు.

ట్రాక్టర్ బోల్తా.. తప్పిన పెను ప్రమాదం

తూప్రాన్: ట్రాక్టర్ రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. బాధితులు, ప్రత్యేక సాక్షుల వివరాల ప్రకారం... మండలంలోని యావపూర్ సమీపంలో తూప్రాన్–గజ్వేల్ రహదారిపై ప్రమాదవశాత్తు ట్రాక్టర్ రోడ్డు పక్కకు దూసుకెళ్లి చెట్టును ఢీకొని బోల్తా పడింది. ట్రాక్టర్ నడుపుతున్న వడ్డెర భిక్షపతితో పాటు మరో వ్యక్తికి తృటిలో పెను ప్రమాదం తప్పింది. కాగా ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజిన్ దెబ్బతింది.

చదువుకునే వారికి వరం

- దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ఓపెన్ స్కూల్
- గ్రామీణ ప్రాంతవాసులకు మంచి అవకాశం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 606 దరఖాస్తులు
- ఈనెల 11 వరకు గడువు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ సొసైటీ మంచి అవకాశం కల్పిస్తుంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు,పురుషులు, యువత సద్వినియోగం చేసుకుంటున్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియెట్‌లో దూర విద్యలో చదువుకునేందుకు ఈ నెల 11వరకు విద్యాశాఖ అధికారులు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.

– సంగారెడ్డి టౌన్:

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 606 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. పదవ తరగతికి 196 మంది, ఇంటర్మీడియెట్‌కు 410 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 11వ తేదీ వరకు ఉంది. పదవ తరగతిలో చేరేందుకు 14 నుంచి 50 ఏళ్లు ఉన్న వారందరికీ అవకాశం ఉంటుంది. దీనికి ఎలాంటి విద్యార్హత లేకుండా ప్రవేశం పొందవచ్చు. ఇంటర్మీడియెట్‌లో చేరాలంటే 15 ఏళ్ల వయసు కలిగి ఉండాలి. పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పదవ తరగతికి పరీక్ష ఫీజు 1150, ఇంటర్మీడియట్‌కు రూ.1500 ఫీజు చెల్లించాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 101 సెంటర్లు ఉన్నాయి. సంగారెడ్డిలో 49, మెదక్‌లో 19, సిద్దిపేటలో 33 ఉన్నాయి



పుస్తకాలను అందజేస్తున్న విద్యాశాఖ అధికారులు

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. చేసుకున్న తర్వాత తప్పనిసరిగా దరఖాస్తు, అవసరమైన డాక్యుమెంట్లను సంబంధిత ఓపెన్ స్కూలులో అందజేయాలి. వారికి కావాల్సిన స్టడీ మెటీరియల్ అందజేస్తారు. రాజకీయాల్లో రాణించాలంటే కూడా తప్పనిసరిగా పదవ తరగతి ఉండాలన్న ఉద్దేశంతో ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు కోరుతున్నారు. ఈ సర్టిఫికెట్లను ప్రభుత్వ ఉద్యోగాలకు కూడా ఉపయోగిస్తారు. నిరక్షరాస్యులకు అవగాహన కల్పించేందుకు పాఠశాలలో, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వాలు కూడా వివిధ రకాల ఉపాధి పథకాలను కల్పించేందుకు అర్హతను చూసి ఇస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ మంచి అవకాశం కల్పిస్తుంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరక్షరాస్యులు సార్వత్రిక విద్యను సద్వినియోగం చేసుకోవాలి. 2025–26 విద్యా సంవత్సరానికి పదవ తరగతి, ఇంటర్‌కు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

– వెంకట్ స్వామి, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్